క్లుప్తంగా

జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారులు




హుస్నారా , నిశ్చయ్

కదిరి అర్బన్: అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు కదిరి క్రీడాకారులు ఇద్దరు హుఆస్నరా, నిశ్చయ్ ఎంపికయ్యారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరుగుతున్న అండర్–15 బాలికల క్రికెట్ అండర్–15 బాలికల జట్టుకు హుస్నారా ఎంపికవగా.. కడపలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న అండర్–19 వన్డే పోటీల్లో పాల్గొనే అనంతపురం జిల్లా జట్టుకు నిశ్చయ్ ఎంపికయ్యాడు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మంగలి నరేష్ (ఫైల్)

కనగానపల్లి: బాలేపాళ్యం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మంగలి నరేష్ (23) అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, పద్మావతి దంపతుల కుమారుడు గతంలో గ్రామ వలంటీర్‌గా పనిచేస్తుండేవాడు. వారం రోజుల క్రితం గుండెపోటుకు గురైన అతన్ని బెంగుళూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం అక్కడే మృతి చెందాడు. దీంతో చేతికి వచ్చిన కొడుకు అకస్మాత్తుగా మృతి చెందటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

వృద్ధుడు మృతి




గంగులప్ప (ఫైల్)

ముదిగుబ్బ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వృద్ధుడు పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎనుములవారిపల్లికి చెందిన బండి గంగులప్ప (66) మే 16న మలకవేముల క్రాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్ని రోజులపాటు చికిత్స పొందాడు. వారం తర్వాత వస్తే ఆపరేషన్ చేస్తామని చెప్పి ఇటీవల డిశ్చార్జి చేశారు. అప్పటి నుంచి ఇంటివద్దే ఉంటున్న గంగులప్ప ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతి చెందాడని కుమారుడు మల్లికార్జున తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

నల్లచెరువు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. కదిరికి చెందిన దిలీప్, మూర్తిపల్లికి చెందిన మహేష్ అనే ఇద్దరు యువకులు మంగళవారం తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో భవన నిర్మాణ పనులకెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయల్దేరారు. నల్లచెరువు మండల పరిధిలోని పాత రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే కదిరి నుంచి మదనపల్లి వైపు వెళ్తున్న కారు వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో దిలీప్, మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రులను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహేష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సబ్సిడీ వేరుశనగ పంపిణీ



కుమ్మరవాండ్లపల్లిలో విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి రైతు సేవ కేంద్రంలో మంగళవారం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను పంపిణీని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. నియోజకవర్గానికి 13,864 క్వింటాళ్ల విత్తనకాయలు మంజూరైనట్లు ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. అనంతరం ఎన్పీకుంట మండలం వెలిచెలమల రైతులకు సబ్సిడీ కింద ఇచ్చిన డ్రోన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై సమీక్ష

కదిరి అర్బన్: స్వర్ణాంధ్ర విజన్ –2047పై ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపథంలో నడిపించేందుకు అధికారులు ప్రణాళికలు రచించాలన్నారు. పరిశ్రమ, వ్యవసాయ రంగాలు తదితర అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. అధికారుల చిత్తశుద్ధితో పని చేసి స్వర్ణాంధ్ర విజన్ సాధించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ మురళీకృష్ణతో పాటు పలువురు డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా ఎజెండా తయారీనా?

- వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులపై మాకు చెప్పరా..?
- మున్సిపల్ ఛైర్మన్, అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం
- వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం
- పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలపని కౌన్సిల్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ క్రాంతికుమార్

పుట్టపర్తి టౌన్: తమకు తెలియకుండా వార్డుల్లో అభివృద్ధి పనులకు సంబంధించి ఎజెండా ఎలా తయారు చేస్తారంటూ మున్సిపల్ ఛైర్మన్, అధికారులపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో ఛైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన కమిషనర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎజెండాలోని అంశాలపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సభ్యుల అనుమతి లేకుండా వార్డు అభివృద్ధి పనులపై ఎజెండా తయారు చేస్తున్నారని, సమావేశంలో ఆమోదం పొందకుండానే పనులు చేపడుతున్నారని, బిల్లులు చేసుకొంటున్నారని 4 వార్డు కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి ధ్వజమెత్తారు. అత్యవసర, విపత్తు సమయాల్లో మాత్రం ర్యాడిఫికేషన్ బిల్లులు పెట్టాలని.. అలా కాకుండా చిన్న చిన్న పనులకు ర్యాడిఫికేషన్ పేరుతో నిధులు స్వాహా చేసేస్తున్నారని మండిపడ్డారు. వార్డులో వీధిలైట్లు, తాగునీరు, రోడ్లు లాంటి సదుపాయాలు కల్పించలేదని పలుమార్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఐదో వార్డు కౌన్సిలర్ సూర్యగౌడ్ మాట్లాడుతూ కుమ్మరిపేటలో నెలలో నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, మోటార్ల మరమ్మతుల పేరిట ఆలస్యం చేస్తున్నారని, స్పేర్ మోటార్ అందుబాటులో ఉంచాలని చెప్పినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రతి వార్డులోనూ బోరు బావులు ఉన్నాయని, మోటార్లు లేనంతమాత్రాన రూ.14 లక్షలతో బోర్లు వేయాలని ఎజెండాలో పొందుపరచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై తాము ఆమోదం తెలపబోమని అధికారులకు తేల్చి చెప్పారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

పుట్టపర్తి అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎక్స్‌అఫిషియో సభ్యురాలు, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో అపరిశుభ్రత పేరుకుపోయిందని, అధికారుల పర్యవేక్షణ కొరవడిందని మండిపడ్డారు. పడమటి గేట్ రోడ్డు మరమ్మతు పనులు, వీధిలైట్లు, తాగునీరు, సుందరీకరణ పనులు చేపట్టి సత్య సాయి శత శతజయంతి ఉత్సవాలు సాగేలా చూడాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యుల సలహాలు తీసుకొని అభివృద్ధి పనులపై చర్చించి ఎజెండా తయారుచేస్తామని చెప్పారు. ప్రతి వార్డుకూ పారిశుధ్య కార్మికులను, ఇద్దరు అధికారులను కేటాయించి సమస్యలు లేని పుట్టపర్తిగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు



కమిషనర్‌కు నోటీసు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందించారు. సీఐటీయూ నాయకులు జె.వి.రమణ, హైదర్‌వలి, ఇంజినీరింగ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, పారిశుధ్య కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ అలవెన్స్, సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని కోరారు. ఈ డిమాండ్ల కోసం సమ్మె చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు అనిల్, యోగి, కాటమయ్య, దస్తగిరి, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఓబిలేసు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



సత్యసాయి శ్రీగిరి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా జరిగింది. ప్రశాంతి నిలయం ముఖ ద్వారం వద్ద అందంగా అలంకరించిన రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని భక్తులు లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతినిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి ,గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఈ ఉత్సవంలో దేశ విదేశీ భక్తులు అధికసంఖ్యంలో పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం



తాడిమర్రిలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తాడిమర్రి: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.50 లక్షలతో నిర్మించిన వ్యాధుల పరీక్ష కేంద్రాన్ని, అలాగే తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు రూ.50 లక్షలతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి ధర్మవరం నియోజకవర్గంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మించామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 168 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వి సల్మాన్, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటరంగరావు, వైద్యాధికారులు హరిత, గోవర్ధన్ నాయుడు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థలం కబ్జా, బెదిరింపులపై ఫిర్యాదు

కదిరి అర్బన్: తమ స్థలాన్ని ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసి బెదిరిస్తున్నారని పట్టణానికి చెందిన శివరాం ప్రతాప్ అనే వ్యక్తి పట్టణ సీఐ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. శివరాం ప్రతాప్, అతని బావమరిది శ్రీధర్ ఇద్దరూ కలిసి 2012, 2018 సంవత్సరాల్లో హిందూపురం రోడ్డు సరస్వతీ విద్యామందిరం పక్కన సర్వేనంబర్ 69–1లో సుమారు 40 సెంట్ల స్థలాన్ని బ్రహ్మానందరెడ్డి అనే వ్యక్తి వద్ద నుంచి కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే ఇటీవల కాలంలో వీవర్స్‌కాలనీకి చెందిన గంగిరెడ్డి, సూర్యనారాయణరెడ్డిలు సదరు స్థలంలో సరిహద్దురాళ్లను తొలగించి గడ్డివేసి ఆక్రమించుకున్నారు. ఈ విషయంపై అడిగితే తమను బెదిరిస్తున్నారని శివరాం ప్రతాప్ పేర్కొన్నాడు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

మడకశిరరూరల్: గొళ్లపల్లి క్రాస్ వద్ద ఓ కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల వివరాల మేరకు.. వైబీ హళ్లి నుంచి మడకశిర వైపు వస్తున్న కారు సోమవారం రాత్రి గొళ్లపల్లి క్రాస్ వద్దకు రాగానే కుక్క అడ్డువచ్చింది. కుక్కను తప్పించబోయి పొలంలోకి దూసుకెళ్లి చెట్టును ఢీకొంది. కారులో ఉన్న వారికి ఏమీ కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఎస్పీబీ పాటలు అజరామరం



నివాళులర్పిస్తున్న దృశ్యం

హిందూపురం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలు అజరామరమని వక్తలు కొనియాడారు. మంగళవారం స్థానిక నానెప్ప నగర్ కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు, సంగీత విభావరి నిర్వహించారు. మంచు మ్యూజిక్ మెలోడీస్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకుడు గాజుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మునిసిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఎస్పీ బాలు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కళాకారులు పాడిన పాటలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, రాజ్యలక్ష్మి, నాగరత్న మోహన్, మాళప్ప, సీజే మనోహర్, రంగారావు, ఉదయ్ కుమార్, ఉమర్ ఫరుక్, కళాకారుల ఐక్యవేదిక సభ్యులు అంజప్ప, చలపతి, శ్రీధర్, సంగీత కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు స్వస్తి చెప్పండి



తాడిమర్రిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్తలు

తాడిమర్రి: బాల్య వివాహాలకు స్వస్తి చెప్పాలని చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ సూచించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మే రెండో తేదీ ప్రారంభించిన కిశోరి వికాసం కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. మంగళవారం తాడిమర్రిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోరి బాలికల వికాశం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అమ్మాయిలు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలన్నారు. బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ చేయవద్దని కోరారు. కిశోరి బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, నాగలక్ష్మి, జయలక్ష్మి, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దు

బత్తలపల్లి: బాలికలకు వివాహాలు జరిపించి వారికి ఆరోగ్య, మానసిక సమస్యలను తీసుకురావద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవమణి పేర్కొన్నారు. మంగళవారం కిశోరి వికాసం ముగింపు కార్యక్రమం బత్తలపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవమణి మాట్లాడుతూ కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్‌లో బాలికలకు అనేక అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పిల్లల హక్కులు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లలకు సంబంధించిన చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 గురించి వివరించారు. అనంతరం పిల్లలు, పెద్దలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఆనంద్, ఏఎన్‌ఎంలు, వీవో లీడర్స్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

‘సాక్షి’పై దాడి అప్రజాస్వామికం



ధర్మవరంలో టూటౌన్ సీఐ రెడ్డప్పకు ఫిర్యాదు అందజేస్తున్న పాత్రికేయులు



ఓడీచెరువు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదు అందజేస్తున్న జర్నలిస్టులు



రామగిరి సీఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేస్తున్న సాక్షి పాత్రికేయ బృందం

- విధ్వంసకారులపై చర్యలు తీసుకోవాలి
- పోలీసుస్టేషన్లలో జర్నలిస్టుల ఫిర్యాదు

ధర్మవరం/ బత్తలపల్లి/ తాడిమర్రి/ ఓడీచెరువు/నల్లమాడ: తెలుగువారి మనస్సాక్షిగా.. పేదల గొంతుకై.. నాణేనికి రెండోవైపు ప్రజల పక్షాన నిలుస్తూ.. వాస్తవాలు ప్రచురిస్తూ... ప్రసారం చేస్తున్న ‘సాక్షి’పై జరిగిన దాడిని జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. అమరావతి రాజధాని అంశంపై సాక్షి టీవీలో ప్రసారమైన చర్చలో వ్యాఖ్యలకు నిరసనగా టీడీపీ నాయకులు రౌడీమూకలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయాలపై దాడులకు తెగబడటాన్ని తప్పు పట్టారు. బయటి వ్యక్తి వ్యాఖ్యలతో సంబంధం లేదని ‘సాక్షి’ చెప్పినా టీడీపీ మూకలు రెచ్చిపోయి బీభత్సం సృష్టించారని, వారిపై కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరుతూ మంగళవారం ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో జర్నలిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశ్లేషకుడు, బయటి వ్యక్తి మాటలను ‘సాక్షి’ మీడియాకు ఆపాదిస్తూ విధ్వంసకాండకు దిగిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్మవరంలో ‘సాక్షి’ ఆర్సీ ఇన్‌చార్జ్ కొత్త విజయభాస్కర్ రెడ్డి, నియోజకవర్గంలోని పాత్రికేయులు శ్రీశైలం భాస్కర్‌గౌడ్, రాము, శేఖర్, రమేష్‌తో కలిసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రెడ్డప్పకు ఫిర్యాదు చేశారు.

- సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే బత్తలపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎస్‌ఐ సోమశేఖర్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. ఇటీవల సాక్షి ఛానెల్‌లో రాజధాని అంశంపై జరిగిన డిబేట్‌లో విశ్లేషకుడు, అభిప్రాయం వ్యక్తం చేసిన జర్నలిస్టు తమ వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసినా.. అక్రమ కేసులు నమోదు చేయడాన్ని ఖండించారు. ఈ వ్యవహారాలతో సాక్షి మీడియాకు సంబంధం లేకపోయినా టీడీపీ కుట్రపూరితంగా తన శ్రేణులను రెచ్చగొట్టి సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, ధర్మవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ చౌదరి, మండల అధ్యక్షులు మదనాపు శ్రీనివాసులు, సాకే శ్రీనివాసులు, కప్పల హరికృష్ణ, మదనాపు కృపాకర్, మదనాపు రాజశేఖర్, వెంకట చౌదరి, సాకే వన్నూరప్ప తదితరులు ఉన్నారు.
- ‘సాక్షి’ కార్యాలయాలపై దాడులు చేయడం అమానుషమని ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ ఉపాధ్యక్షుడు చందమామ వీరనారప్ప అన్నారు. పత్రిక కార్యాలయాలపై దాడి చేసిన దుండగులపై కేసులు నమోదు చేసి, శిక్షించాలని మంగళవారం ఆయన జర్నలిస్టులు వీరబొమ్మ నాగరాజయ్య (అక్షర), అగిలే అనంతరెడ్డి (పబ్లిక్ టుడే), బండారు వెంకటేష్ (సూర్య) తదితరులతో కలిసి తాడిమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలకు విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు క్షమాపణ చెప్పినా కూటమి ప్రభుత్వం కక్షకట్టి అక్రమంగా కేసు పెట్టించడం దుర్మార్గమని జర్నలిస్టులు ఖండించారు.
- పత్రికా స్వేచ్ఛను హరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. సీనియర్ జర్నలిస్టు, విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించారు. పత్రికా కార్యాయాలపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే నాయకులు సాదిక్, వసంతం భుజంగంరావు, ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సీనియర్ పాత్రికేయులు రంగప్ప, బాబాఫక్రుద్దీన్, ఫిరోజ్, బీఆర్‌కే మహబూబ్ బాషా, మల్లికార్జున రెడ్డి ఓడీచెరువు పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు అందజేశారు.
- సాక్షి కార్యాలయాలపై కుట్రపూరితంగా దాడులు చేసిన వారిపై వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జర్నలిస్టులు మంగళవారం నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ రఘురాంకు ఫిర్యాదు సమర్పించారు. పలువురు జర్నలిస్టులు, నాయకులు మాట్లాడుతూ కార్యాలయాలపై దాడులు అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సోమశేఖర్, బాబ్‌జాన్, వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, మండల కమిటీ సభ్యులు షంషీర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సలీం, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, ఏఎస్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయాలపై దాడులు సరికాదు

కనగానపల్లి: పత్రికా స్వేచ్ఛను హరిస్తూ సాక్షి కార్యాలయాలపై దాడులు చేయటం సరికాదని పలువురు జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. సాక్షి కార్యాలయాలపై దాడులు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ రాప్తాడు నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి మండలాల్లోని సాక్షి విలేకర్లు, ఇతర మీడియా సంస్థల ప్రతినిధులు చెనేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సాక్షి రాప్తాడు ఆర్సీ ఇన్‌చార్జ్ మహదేవరెడ్డి, పాత్రికేయులు చెన్నేకొత్తపల్లి మురళీధర్, రామగిరి అశోక్‌కుమార్, సాక్షి టీవీ విలేకరి ఇలియాజ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం



ఈరావులప్ప (ఫైల్)

బత్తలపల్లి: భార్యతో గొడవపడి భర్త అదృశ్యమయ్యాడు. పత్యాపురం గ్రామానికి చెందిన మండ్లి ఈరావులప్ప ఆదివారం ఉదయం భార్య శిరీషతో ఏదో విషయంలో గొడవపడ్డాడు. అనంతరం మేకలకు ఆకులు తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఈరావులప్ప తిరిగి రాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాలు, ధర్మవరం, అనంతపురం, ముదిగుబ్బ, కదిరి రైల్వే స్టేషన్లు, బస్టాండ్ ప్రాంతాల్లో వెతికినా కనిపించలేదు. దీంతో తన కుమారుడు ఈరావులప్ప కనిపించడం లేదని తండ్రి తిమ్మప్ప మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఫిట్‌నెస్ లేని బడిబస్సులపై చర్యలు తీసుకోండి



ఆర్టీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో బస్సు ఫీజులను వసూలు చేస్తూ ఫిట్‌నెస్ లేని బడి బస్సులను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్టీఓ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు, నిబంధనలు పాటించకుండా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతున్నాయన్నారు. బడి బస్సుల్లో విద్యార్థులకు సంబంధించి భద్రతా ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పొగాకు క్యాన్సర్‌కు కారకం



ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ధర్మవరం అర్బన్: పొగాకు వాడకం క్యాన్సర్‌కు కారణమవుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. పొగాకు జోలికి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. పట్టణంలోని కొత్తపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పొగాకు నమలడం, తాగడం వల్ల కలిగే ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నికోటిన్ ఉత్పత్తి తయారీ కంపెనీలు నూతన తరాన్ని ఎలా ఆకర్షిస్తున్నారు, తప్పుడు ప్రకటనల ద్వారా ఏవిధంగా ప్రభావితం చేస్తున్నారో యువతకు, సామాన్యులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పొగాకు వాడకం పర్యావరణానికి ముప్పు అని, బీడీ, సిగరెట్ కాల్చవద్దు, క్యాన్సర్ వ్యాధులు తెచ్చుకోవద్దు, స్మోకింగ్‌కు నో చెప్పు.. ఆరోగ్యానికి ఎస్ చెప్పు అంటూ నినాదాలు చేశారు. రైల్వేస్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు, కొత్తపేటలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌టీసీపీ సామాజిక కార్యకర్త శమంతకమణి, ఎంపీహెచ్‌ఏ మోహన్‌కుమార్, సీఓ మారుతీకుమార్, ఫార్మసిస్ట్ శ్రీనివాసరెడ్డి, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.